



## ఎన్పీడీసీఎల్‌లో త్వరలో పలు పోస్టుల భర్తీ

హనుమకొండ సబర్బన్, జూన్ 26 : ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటరల నియామక ప్రక్రియను త్వరలో నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ జాయింట్ సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్పీడీసీఎల్‌లో గత సంవత్సరం 04/06/2023న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ వంద పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించారు. అయితే నియామక ప్రక్రియపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. కాగా, కోర్టు ఉత్తర్వుల ప్రకారం మిగిలిన పోస్టుల భర్తీని తర్వలో నిర్వహిస్తామని ఎన్పీడీసీఎల్ యాజమాన్యం తెలిపింది.

## కేటీపీపీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

గణపురం, జూన్ 26: చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో బుధవారం మొదటి దశ 500, రెండో దశ 600 మెగావాట్ల ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఒకేసారి రెండు ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడం ఇదే మొదటిసారి. ఒక్కరోజు విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతే సంస్థకు రూ.4 కోట్ల నష్టం వాటిల్లనుంది. మళ్లీ విద్యుత్ ఉత్పత్తి కొనసాగాలంటే రెండు, మూడు రోజులు పడుతుందని కేటీపీపీ అధికారులు తెలిపారు.

**ఇది మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని మోటర్లు, స్టార్టర్లు రిపేరు చేసే దుకాణం. ఇలాంటి షాపులు పట్టణంలో ఏడు వరకు ఉన్నాయి. గతంలో ఒకటీ అర వచ్చేవి. కానీ ప్రస్తుతం రోజుకు 20 వరకు కాలిన మోటర్లు, స్టార్టర్లు మరమ్మతు కోసం వస్తున్నాయి. కరంటు సరిగా రాని కారణంగా రిపేరు చేసిన కొద్దిరోజులకే మళ్లీ కాలిపోవడంతో వాటిని మోసుకొని దుకాణాలకు రావాల్సిన దుస్థితి దాపురించింది.**



తొర్రూరులోని ఎలక్ట్రికల్ షాపు వద్దకు మరమ్మతు కోసం రైతులు తెచ్చిన మోటర్లు

# సర్కారు కోతలు రిపేరుకు మోటర్లు

వచ్చీరాని కరంటుతో ఆగమవుతున్న రైతులు

ప్రభుత్వం చెప్పే మాటలకు.. సరఫరాకు పొంతనే లేదు

వచ్చీపోయే కరెంట్‌తో అన్నదాతలు అరిగోస పడుతున్నరు. రోజుకు ఐదారు సార్లు పోవడం.. లో వోల్టేజీతో స్టార్టర్లు, మోటర్లు కాలుడు.. డీపీలు పేలిపోవడం సర్వసాధారణమైంది. ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల దాకా కరెంట్ ఇస్తున్న పేరే కాని పొలాల దగ్గర త్రీఫేస్ లేక నానా ఇబ్బందులకు గురవుతున్నరు. కాలిపోయిన స్టార్టర్లు, మోటర్లను తొర్రూరుకు తీసుకు వచ్చి బాగు చేయించి పెట్టిన రెండు రోజులకే కరెంట్‌తో మళ్ల ఆగం అవుతున్నరు. ఏం బాగు చేసినవని మెకానిక్‌ను అడిగితే కరెంట్ సక్కగ లేకపోతే మేమేం చేయాలని చేతులెత్తేస్తున్నరు. ఒక తొర్రూరుకే రోజుకు 20 మోటర్లు, స్టార్టర్లు రిపేర్ కోసం పట్టుకొస్తున్నరు. ఈ మాయదారి కరెంట్ ఎప్పుడు సక్కగైతదో.. మా గోస ఎప్పుడు తీరుతదో అంటూ రైతులు తలలు పట్టుకుంటున్నారు.

*- తొర్రూరు, జూన్ 26*

## లో, హై వోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లపై భారం

- రోజుకు 20కి పైగా మరమ్మతులకు తీసుకొస్తున్న వైనం
- స్టార్టర్‌కు రూ.1500.. మోటర్‌కు రూ.3 నుంచి 6 వేల ఖర్చు
- ఆందోళన చెందుతున్న తొర్రూరు డివిజన్ రైతులు

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రోజు ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నాణ్యత లేకుండా సరఫరా జరుగుతోంది. కనీసం ఐదారు సార్లు అంతరాయం తలెత్తడం, లో, హైవోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడి డీపీలు పేలిపోయి మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలుతున్నాయని రైతులు చెబుతున్నారు. తొర్రూరులో ఏడు చోట్ల మోటర్లు, స్టార్టర్లు మరమ్మతు చేసే షాపులుంటే వీటికి రోజుకు 20 వరకు వస్తున్నాయని చెబుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం నాటి పరిస్థితులు పునరావృతం అవుతున్నాయని, వర్షాలు పడకపోతే రైతులు ఇంకా నష్టపోయే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఒక స్టార్టర్ కాలితే రూ.500 నుంచి రూ.1500 వరకు, మోటర్‌కు అయితే రూ.3వేల నుంచి రూ.6వేల వరకు ఖర్చవుతున్నదని, రవాణా భారం అదనమని రైతులు ఆవేదనతో చెబుతున్నారు. కాలిన మోటర్ లేదా స్టార్టర్ బాగు చేయించుకోవడానికి కనీసం మూడు రోజుల పాటు నిరీక్షిస్తున్నారు. కొన్నిచోట్ల త్రీఫేస్ కరెంట్ కోసం రైతులు విద్యుత్ అధికారులను ఆశ్రయిస్తే తిరిగి వారే తమ గోడును రైతులకు వెల్లబోసుకునే పరిస్థితులు దాపురించాయని చెబుతున్నారు.

### మోటర్లు కాలితే రూ.6వేలైంది..



మా పొలం దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ డీపీలు ఒక్కసారి పేలడంతో మా మోటర్ కాలిపోయింది. రిపేర్ కోసం తొర్రూరుకు తీసుకువస్తే రూ. 6 వేలు ఖర్చయింది. రోజుకు ఐదారు సార్లు కరెంట్ ట్రిప్ అవుతుండడంతో ఇబ్బంది పడుతున్నం. పేలిన ట్రాన్స్‌ఫార్మర్లు బాగు చేయించి పెట్టాలంటే రోజుల కొద్దీ ఎదురు చూడాల్సిందే. కరెంట్ కూడా సక్రమంగా రావడం లేదు.

– పున్నం ముకేశ్, రైతు, పోలెపల్లి

### ఇదివరకు ఈ కష్టాల్లేవ్



మాకు త్రీఫేస్ కరెంట్ కావాలని ఆఫీసర్ల చుట్టూ తిరిగినా పని కావడం లేదు. సింగిల్ ఫేస్ కరెంట్‌తో మోటర్లపై భారం పడి కాలిపోతున్నయి. వారంలో నా స్టార్టర్ రెండు సార్ల కాలితే పట్టుకొచ్చిన. ఇప్పటికే రెండు వేల పైన ఖర్చయింది. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ కష్టాలైతే లేవు.

– జాటోత్ సంతోష్, రైతు, టీక్యాతండా



### రిపేరుకు మోటర్లు ఎక్కువస్తున్నయ్

గతంతో పోలిస్తే ఈ ఏడాది కాలిపోతున్న మోటర్లు, స్టార్టర్ల సంఖ్య బాగా పెరిగింది. బాగు చేసి రైతుకు అప్పజెప్పిన తర్వాత మళ్ల నాలుగు రోజులకే మోటరు, స్టార్టర్ కాలిపోయిందని, ఏం పని చేశావని నిలదీస్తున్నరు. కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఈ సమస్య వస్తోంది. చేసేదేమీ లేక, రైతు బాధ చూడలేక నష్టమైనా మళ్లీ బాగు చేసి ఇస్తున్నం. షాపులో ఈ పనులు తెలిసిన వర్కర్లు లేక రిపేర్ చేసి ఇవ్వడం ఇబ్బందిగా మారింది.

– గుగ్గిళ్ల శ్రీనివాసాచారి, మెకానిక్

### సమస్యలుంటే సమాచారం ఇవ్వాలి

వర్షాల కారణంగా రాత్రివేళ త్రీఫేస్ సరఫరాలో అవాంతరాలు తలెత్తితే సింగిల్‌ఫేస్ ఇస్తున్నాం. కొన్నిచోట్ల అప్ అండ్ డౌన్ కారణంగా మోటర్లు, స్టార్టర్లు కాలిపోయి, ట్రాన్స్‌ఫార్మర్లపై డీపీలు పేలి రైతులు ఇబ్బందులు పడితే వెంటనే సమాచారం ఇవ్వాలి. సీఎండీ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కూడా నిర్వహిస్తున్నందున ఓవోల్టేజీ సమస్యలు తలెత్తే ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలను ఫిర్యాదుల రూపంలో రైతులు అందజేయవచ్చు. వ్యవసాయానికి, గృహావసరాలకు అంతరాయం లేకుండా సరఫరా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ బ్రేక్ డౌన్ జరిగినా వెనువెంటనే సమస్యను పరిష్కరించి పునరుద్ధరిస్తున్నాం.

– ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్



హనుమకొండలో జోరుగా పడుతున్న వాన



# కురిసింది వాన..


- వారం తర్వాత కరుణించిన వరుణుడు
- పంటలకు జీవం.. అన్నదాతల హర్షం
- ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం

వరుణుడు కరుణించాడు. వాన జాడలేక ఇటు రైతులు, ప్రజలు అల్లాడుతూ వేయికళ్లతో ఎదురుచూస్తున్న వేళ బుధవారం సాయంత్రం చిరుజల్లులతో మొదలైన వర్షం వారిలో సంతోషం నింపింది. ఉమ్మడి జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జనగామ సహా పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు మొక్కలను కాపాడుకునేందుకు బిందెలతో నీరుపోస్తూ నానా ఇబ్బందులు పడుతున్న క్రమంలో తాజాగా కురిసిన వర్షం పంటలకు జీవం పోసినట్లయ్యింది. అలాగే వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో వారం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయిన జనాలకు ఉపశమనం కలిగింది.

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్*



జనగామ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం



హనుమకొండలో వర్షంలోనే వెళ్తున్న వాహనదారులు

### • మత్తులో పడొద్దు



జనగామలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

**మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఉమ్మడి జిల్లా అంతటా ర్యాలీలు, మానవహారాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేస్తూ పోలీసులు, అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. ముఖ్యంగా యువతను పెడదోవ పట్టిస్తున్న మత్తు అనే మహమ్మారిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రతిజ్ఞ చేశారు.**




భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## బొగ్గు బ్లాకులు వేలం వేయొద్దు

*భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా*

కృష్ణకాలనీ, జూన్ 26 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని వెంటనే రద్దుచేయాలంటూ బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణను, బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మోటపలుకుల రమేశ్, భూపాలపల్లి పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే 60 సింగరేణి బ్లాకులను వేలం వేసేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. ఉత్తర తెలంగాణకే గుండెకాయలాంటి సింగరేణి సంస్థను బీజేపీ సర్కారు నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నదని, దీనివల్ల కార్మిక కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ప్రైవేటీకరణను అడ్డుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వేలాన్ని విరమించుకోకుంటే సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందించారు. నాయకులు క్యాతరాజు సతీశ్‌కుమార్, గురిజేపల్లి సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, నేరెళ్ల జోసెఫ్, ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఆసిఫ్ పాషా, బ్రాంచ్ కమిటీ సభ్యులు రవికుమార్, నూకల చంద్రమౌళి, ఫిట్ సెక్రటరీలు ఎల్ శంకర్, పీ శ్రీనివాస్, దోర్నాల తిరుపతి, ఎం రమేశ్, ఎండీ కరీముల్లా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ధరలు అదుపు చేయాలి

*రోడ్లపై కూరగాయలతో సీపీఐ నిరసనలు*

నమస్తే నెట్‌వర్క్, జూన్ 26 : పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించాలని బుధవారం ఉమ్మడి జిల్లాలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో, వరంగల్‌లోని పోచమ్మమైదాన్ సెంటర్, నర్సంపేటలోని అమరవీరుల స్తూపం వద్ద, నెక్కొండ తదితర ప్రాంతాల్లో వినూత్న రీతిలో నిరసన ప్రదర్శనలు, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నెల రోజులుగా నిత్యావసర వస్తువులతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలు విక్రయిస్తున్న వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రస్తుతం టమాట, పచ్చి మిర్చి కిలో రూ.100, ఉల్లిగడ్డ రూ. 50కి చేరుకున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్రం నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు కఠిన చట్టాలను రూపొందించాలని, లేకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు



జనగామ కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న పంచాయతీ కార్మికులు

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

*జనగామ కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా*

జనగామ, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : ఆరు నెలలుగా బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జనగామ కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం వినతిపత్రం అందజేశారు. మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, గతంలో మాదిరిగా కేటగిరీల వారీగా విధులు అప్పగించాలని, ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డికి సమస్యలు చెప్పుకుంటే ప్రభుత్వం రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రంలోని 54 వేల మంది కార్మికులను ఏకం చేసి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అలాగే మహబూబాబాద్, హనుమకొండ కలెక్టరేట్ల వద్ద మున్సిపల్ కార్మికులు ఆందోళన చేశారు.